
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
ఆదివారం । 2 । మార్చి । 2025



టన్ను చీనీ రూ.22,850
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22,850, కనిష్టంగా రూ.8,120 ప్రకారం ధర పలికాయి.



కిలో టమాట రూ.9
కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.9 కనిష్టంగా రూ.5 ప్రకారం ధర పలికింది. మార్కెట్‌కు 450 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.



న్యూస్‌రీల్

9 నుంచి ఖాద్రీశుడి బ్రహ్మోత్సవాలు



అధికారులతో కలిసి పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కందికుంట

కదిరి టౌన్‌: ఖాద్రీ లక్ష్మీనారసింహుడి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 9వ తేదీ నుంచి 23వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో శనివారం ఖాద్రీ ఆలయంలో అన్ని శాఖల అధికారులతో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్‌ మాట్లాడుతూ.. శ్రీవారి బ్రహ్మోత్సవాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి లక్షలాది మంది భక్తులు వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. అందరం సమష్టిగా పనిచేసి బ్రహ్మోత్సవాలను విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం ఖాద్రీశుని బ్రహ్మోత్సవాల పోస్టర్లను ఎమ్మెల్యే అధికారులతో కలిసి ఆవిష్కరించారు. సమావేశంలో ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి, ఆర్డీఓ వీవీఎస్‌ శర్మ, మున్సిపల్‌ కమిషనర్‌ కిరణ్‌కుమార్‌, మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, బీజేపీ యువ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు మిట్టా వంశీకృష్ణ, ప్రధాన అర్చకులు పార్థసారథి ఆచార్యులు, నరసింహాచార్యులు, అంజన్‌కుమార్‌ స్వామి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్క్రీనింగ్‌ పరీక్షలు సజావుగా జరగాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఫైరోజాబేగం



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఫైరోజాబేగం

పుట్టపర్తి అర్బన్‌: సంక్రమిత, అసంక్రమిత వ్యాధులను గుర్తించేందుకు గ్రామాల్లో జరుగుతున్న స్క్రీనింగ్‌ పరీక్షలు సజావుగా నిర్వహించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ ఫైరోజా బేగం ఆదేశించారు. శనివారం ఆమె పుట్టపర్తి మండలం బత్తలపల్లిలో జరుగుతున్న స్క్రీనింగ్‌ పరీక్షలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... స్క్రీనింగ్‌ సమయంలో ప్రతి ఇంటినీ సందర్శించాలని, ఆయా కుటుంబాల్లోని ప్రతి ఒక్కరినీ పరీక్షించాలన్నారు. అలాగే ప్రతి కేసునూ నమోదు చేయాలన్నారు. డీఎంహెచ్‌ఓ వెంట జిల్లా ఇమ్యునైజేషన్‌ అధికారి డాక్టర్‌ శ్రీనివాసరెడ్డి, వైద్యాధికారి డాక్టర్‌ జ్యోత్స్న, సూపర్‌వైజర్‌ రమణ, ఎంఎల్‌హెచ్‌పీ సత్యమ్మ తదితరులు ఉన్నారు.

రుణానికి సువర్ణ అవకాశం

- హిందూపురానికి చెందిన నరేష్‌ చిరు ఉద్యోగి. ఇద్దరు పిల్లల చదువు కోసం రూ.3 లక్షలు అవసరం కాగా, పలువురి వద్ద రుణం కోసం ప్రయత్నించినా... ఫలితం లేకపోయింది. మరోమార్గం లేక తన భార్య నగలను తాకట్టు పెట్టి బ్యాంకులో రుణం తీసుకున్నాడు. ప్రతి నెలా జీతం వచ్చినప్పుడు వాయిదాలు చెల్లిస్తున్నాడు. అవసరానికి బంగారం లేక పోతే పిల్లలను చదివించడం కష్టమయ్యేదంటున్నాడు.
- ధర్మవరానికి చెందిన బాలాజీకి అత్యవసరంగా డబ్బు అవసరమైంది. ఎవరినైనా అడగాలంటే మొహమాటం.. అడిగినా ఇస్తారో లేదోనన్న అనుమానం. దీంతో భార్యతో చర్చించి చివరకు బంగారు నగలతో బ్యాంకుకు వెళ్లి 'గోల్డ్‌ రుణం' తీసుకున్నాడు.
- పుట్టపర్తికి చెందిన శిరీష్‌కు ఇటీవలే వివాహమైంది. అత్తింటివారు తనకూ భార్యకు బంగారు నగలు చేయించారు. వాటిని ఇంట్లో పెట్టుకునేందుకు ధైర్యం చాలడం లేదు. బ్యాంకుకు వెళ్లి లాకర్‌ అడగ్గా...అందుబాటులో లేదన్నారు. పైగా ఏడాదికి అద్దె భారీగా చెల్లించాలని చెప్పారు. దీంతో శిరీష్‌ నగలను బ్యాంకులో పెట్టి రుణం తీసుకున్నాడు. నెలలో 90 శాతం మొత్తం రుణం చెల్లించాడు. మిగతా 10 శాతానికి వడ్డీ లాకర్‌ అద్దె కంటే తక్కువే అయ్యింది.

..ఇలా అవసరానికి ఒకరు..భద్రపరిచేందుకు మరికొందరు బ్యాంకుల ద్వారా 'గోల్డ్‌ లోన్‌' తీసుకుంటున్నారు. ఎవరి వద్దా చేయి చాపాల్సిన అవసరం లేకుండా ఏ ఆర్థిక అవసరం వచ్చినా 'గోల్డ్‌'వైపు చూస్తున్నారు.



- జిల్లాలో భారీగా పెరిగిన 'గోల్డ్‌' లోన్లు
- అవసరానికి కొందరు.. భద్రత కోసం మరికొందరు
- నగలతో బ్యాంకు మెట్లెక్కుతున్న జనం

హిందూపురం అర్బన్‌: బంగారం.. ఇప్పుడు అందరికీ అత్యవసర నిధి. అందుకే ధర భగ్గుమంటున్నా కొనేందుకు జనం ఏ మాత్రం వెనక్కు తగ్గడం లేదు. చాలా మంది బంగారు ఆభరణాలు ఒంటిపై ఉంటే సమాజంలో గౌరవంగా చాలా మంది భావిస్తున్నారు. అలాగే అత్యవసర సమయంలోనూ ఆదుకునే అత్యవసర నిధిగా భావిస్తున్నారు. అందుకే ధర ఎంతగా ఎగబాకినా...కొనేందుకు జనం మొగ్గు చూపుతున్నారు.

బంగారం చేతిలో ఉంటే క్షణాల్లో రుణం..

ఏదైనా రుణం కావాలంటే బ్యాంకులకు వెళితే.. సవాలక్ష నిబంధనలు చెబుతారు. కొన్నిసార్లు నెలల తరబడి తిరిగినా రుణం మంజూరు కాని పరిస్థితి. కానీ 'గోల్డ్‌ లోన్‌' అలా కాదు. చేతిలో బంగారు నగలుంటే చాలు బ్యాంకర్లు, ఫైనాన్స్‌ సంస్థలు క్షణాల్లో రుణం మంజూరు చేస్తున్నారు. దీంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు తమ ఆర్థిక అవసరాలను తీర్చుకునేందుకు కోసం 'గోల్డ్‌ లోన్‌' తీసుకొంటున్నారు.

గ్రామగ్రామానా వెలిసిన సంస్థలు..

'గోల్డ్‌ లోన్‌' వ్యాపారం భారీగా జరుగుతుండగా... హిందూపురం, ధర్మవరం, కదిరి లాంటి పట్టణాల్లోనే కాకుండా మారుమూల గ్రామాల్లోనూ బ్యాంకులు, ఫైనాన్స్‌ కంపెనీలు వెలిశాయి. అవసరానికి అప్పులు పుట్టని చాలామంది 'గోల్డ్‌లోన్‌' తీసుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నారు. 'ప్రైవేట్‌' వ్యక్తుల వద్ద తీసుకునే రుణానికి వడ్డీ కొండంత ఉండటంతో చాలా మంది బ్యాంకులు, ఫైనాన్స్‌ సంస్థలను సంప్రదిస్తున్నారు. బ్యాంకులతో పాటు ప్రైవేటు సంస్థలు బంగారం నాణ్యతను బట్టి లోన్‌ మంజూరు చేస్తున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో 10 గ్రాముల బంగారానికి రూ.52 వేలకుపైగా రుణం ఇస్తున్నారు. పైగా తక్కువ వడ్డీలకే రుణాలు మంజూరవుతుండటంతో చాలా మంది 'గోల్డ్‌లోన్‌' తీసుకుంటున్నారు. ప్రస్తుతం జిల్లాలో ప్రధాన బ్యాంకులతో పాటు సహకార సంఘ బ్యాంకులు, ముత్తూట్‌ మనీ, మణప్పురం, శ్రీరామ్‌ చిట్స్‌ తదితర సంస్థలు విరివిగా 'గోల్డ్‌లోన్‌' మంజూరు చేస్తున్నాయి. కొందరైతే బంగారాన్ని కుదవపెట్టి లోన్‌ తీసుకొని దాని ద్వారా వ్యాపారాలు చేస్తుండటం విశేషం.

నెలకు రూ.12 కోట్ల పైమాటే

- జిల్లా వాసులు ప్రస్తుతం బ్యాంకులు, వివిధ ప్రైవేటు సంస్థల్లో నెలకు రూ.12 కోట్ల దాకా బంగారంపై రుణాలు తీసుకుంటున్నారు. గతంలో ఈ మొత్తం రూ.9 కోట్లలోపే ఉండేది. సంక్షేమ పథకాలు అమలుకాకపోవడం, ఇతరత్రా కారణాల వల్ల ప్రజల చేతిలో డబ్బు ఉండడం లేదు. దీంతో అవసరాల కోసం బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు తీసుకునే వారి సంఖ్య ఇటీవల బాగా పెరిగింది.
- 80 శాతం మంది బ్యాంకుల్లోనే తాకట్టు పెడుతున్నారు. మిగిలిన 20 శాతం ప్రైవేటు సంస్థల్లో తాకట్టు పెట్టి రుణాలు పొందుతున్నారు.
- బంగారు రుణాలపై బ్యాంకులు 8.5 శాతం నుంచి 9 శాతం వరకు, ప్రైవేటు సంస్థలు 10 శాతం వరకు వడ్డీ వసూలు చేస్తున్నాయి.
- గ్రామీణం, పట్టణం అనే తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లోనూ బంగారాన్ని తాకట్టు పెట్టి రుణాలు పొందేవారి సంఖ్య ఇటీవలి కాలంలో బాగా పెరిగింది.

లాకరు అద్దె ఎందుకనీ...

డబ్బున్న వారు సైతం బంగారాన్ని లాకర్లలో ఉంచడం తగ్గించేశారు. అదే బంగారాన్ని తాకట్టు పెట్టి అప్పు తీసుకొని ఇతర రంగాల్లో పెట్టుబడులు పెడుతున్నారు. లేదంటే తీసుకున్న రుణంలో 90 శాతం మొత్తం నెలలోపు తీర్చేస్తున్నారు. మిగిలిన 10 శాతం మొత్తాన్ని ఏడాది తర్వాత వడ్డీతో కలిపి కట్టేస్తున్నారు. మళ్లీ బంగారాన్ని లోన్‌ కోసమంటూ బ్యాంకుల్లో పెట్టేస్తున్నారు. దీంతో జిల్లాలో ప్రధాన పట్టణాలతో పాటు మండల కేంద్రాల్లోని వివిధ బ్యాంకు శాఖల్లో కిలోల కొద్దీ బంగారం నగలు ఉంటున్నాయి. గోల్డ్‌ రుణాలు పొందేవారి సంఖ్య పెరుగుతుండటంతో బ్యాంకుల్లోని సేఫ్‌ లాకర్లలో నగల మూటలూ పెరిగిపోతున్నాయి.

తొలిరోజే 479 మంది గైర్హాజరు

- ప్రారంభమైన ఇంటర్‌ మొదటి సంవత్సరం పరీక్షలు
- మంగళకర కళాశాల పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్‌ చేతన్‌



మంగళకర కళాశాలలోని పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్‌ చేతన్‌

పుట్టపర్తి: ఇంటర్మీడియెట్‌ మొదటి సంవత్సరం పబ్లిక్‌ పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏర్పాటు చేసిన 42 కేంద్రాల్లో జనరల్‌ విద్యార్థులు 11,843 మందికి గాను 11,460 మంది, ఒకేషనల్‌ కోర్సుకు సంబంధించి 1,580 మందికి గాను 1,484 మంది తొలిరోజు జరిగిన సెకండ్‌ లాంగ్వేజ్‌ పేపర్‌-1 పరీక్ష హాజరయ్యారు. రెండు విభాగాల్లో 479 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు ఇంటర్‌ విద్య జిల్లా అధికారి రఘునాథరెడ్డి తెలిపారు. సోమవారం (3వ తేదీ) ఇంటర్‌ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని ఆయన పేర్కొన్నారు. కాగా తొలిరోజు శనివారం మంగళకర కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్‌ టీఎస్‌ చేతన్‌ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కేంద్రంలో ఏర్పాటు చేసిన మౌలిక వసతుల గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

పటిష్ట భద్రత..

ఇంటర్‌ పరీక్షలు ప్రశాంతంగా సాగేలా పోలీసులు పటిష్ట భద్రతా చర్యలు చేపట్టారు. అభ్యర్థులకు ఇబ్బందులు కలగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు. అభ్యర్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోనికి పంపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్‌ అమలు చేశారు. అభ్యర్థులను మినహా ఎవరిని అనుమతించలేదు.

సిద్ధేశ్వరా.. సిడిమాను చూడరా





వెండి అలంకరణలో సిద్ధేశ్వరస్వామి, సిడిమానుకు వేలాడుతున్న భక్తులు

అమరాపురం: సిద్ధేశ్వరుడి సిడిమాను ఉత్సవం కమనీయంగా సాగింది. హేమావతిలో వెలిసిన హెంజేరు సిద్ధేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం సాయంత్రం సిడిమాను ఉత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం సిద్ధేశ్వరస్వామిని అర్చకులు వెండితో చూడముచ్చటగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయ ఆవరణలో కుడివైపున ఉన్న సిడిమాను ముందు ఉన్న కట్ట వద్దకు తీసుకువచ్చి పూజలు చేశారు. అనంతరం సిడిమాను ఉత్సవాన్ని నిర్వహించారు. సిడిమానుకు వేలాడేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. సాయంత్రం 5.30 గంటలకు ఉత్సవ కమిటీ చైర్మన్‌ కరేగౌడ, ఈఓ నరసింహరాజు, అర్చకులు, గ్రామ పెద్దలు సిడిమాను వద్దకు చేరుకుని ముందుగా నమోదు చేసుకున్న పేర్ల వారీగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన పెద్ద సిడిమానుకు ఒక వైపు భక్తులు వేలాడుతుండగా, మరోవైపు తిప్పుతుంటారు. ఇలా సిడిమానుకు వేలాడుతూ తిరగడం వల్ల కోర్కెలు తీరుతాయని భక్తుల నమ్మకం. రాత్రి స్వామివారిని ముత్యాలపల్లకిలో కూర్చోబెట్టి ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్‌ తిప్పేస్వామి, గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు. కాగా, బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం చిన్న రథోత్సవాన్ని నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ ఈఓ నరసింహరాజు, ఉత్సవ కమిటీ చైర్మన్‌ కరేగౌడ తెలిపారు.

విలీనం.. నిరసనాగ్రహం

చెన్నేకొత్తపల్లి: మండల పరిధిలోని న్యామద్దెల గ్రామంలోని దళితవాడలోని ప్రాథమిక పాఠశాలను గ్రామంలోని మరో పాఠశాలలో విలీనం చేసేందుకు శనివారం పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశాన్ని నిర్వహించారు. పాఠశాలలను విలీనం చేసి మోడల్‌ పాఠశాలగా చేయాలని ప్రభుత్వం ప్రతిపాదనలు పంపిందని తెలపగా, తల్లిదండ్రులు తీవ్ర అభ్యంతరం తెలిపారు. తమ పిల్లలకు 'మోడల్‌ స్కూల్‌' అవసరం లేదని, ఇప్పుడున్న పాఠశాలను కొనసాగిస్తే చాలన్నారు. పాఠశాలలో 50 మందికి పైగా విద్యార్థులు ఉన్నారని, వారి భవిష్యత్‌తో ఆడుకోవద్దని వేడుకున్నారు.



న్యామద్దెల పాఠశాల ముందు నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాఠశాల గేటు ఎదుట ప్లకార్డులతో నిరసన తెలిపారు. 'విలీనం' ఆలోచనను అధికారులు మానుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. దీంతో ఉపాధ్యాయులు ఈ విషయాన్ని మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పడంతో ఆందోళన విరమించారు.

ప్రజాసేవే పరమావధిగా పనిచేయాలి





ఎస్‌ఐల మార్చ్‌ఫాస్ట్‌, హోంమంత్రి అనిత చేతుల మీదుగా సీఎం పిస్టల్‌ అందుకుంటున్న ఎస్‌ఐ మంజునాథ్‌, చిత్రంలో డీజీపీ హరీష్‌కుమార్‌ గుప్తా

- ఎస్‌ఐల పాసింగ్‌ అవుట్‌పరేడ్‌లో హోం మంత్రి అనిత

అనంతపురం: పోలీసులు ప్రజా సేవే పరమావధిగా పనిచేయాలని, పోలీసు స్టేషన్‌ గడప తొక్కే బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత సూచించారు. అనంతపురంలోని పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో స్టైఫండరీ కేడెట్‌ ట్రైనీ (ఎస్‌సీటీ)-2024 ఎస్‌ఐల పాసింగ్‌ అవుట్‌ పరేడ్‌ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు మొత్తం 394 మంది ఎస్‌ఐలు కాగా... ఇందులో 300 మంది సివిల్‌ ఎస్‌ఐలు, 94 మంది ఏపీఎస్‌పీ ఎస్‌ఐలు ఉన్నారు. ముఖ్య అతిథిగా హాజరైన హోం మంత్రి మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణతో అనేక కఠిన సవాళ్లను ఎదుర్కొని ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో పోలీస్‌ శాఖ కృషి మరువలేనిదన్నారు. విజయవంతంగా శిక్షణ పూర్తి చేసుకుని విధుల్లో చేరబోతున్న నూతన ఎస్‌ఐలందరికీ అభినందనలు తెలిపారు. 394 మంది ఎస్‌ఐలలో 97 మంది మహిళా ఎస్‌ఐలు ఉండడం సంతోషంగా ఉందన్నారు. ఇటీవల కాలంలో మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళలు, చిన్నారులపై ఏ చిన్న నేరమూ జరగకుండా వారిని కాపాడే బాధ్యత మనందరిపైనా ఉందన్నారు.

జవాబుదారీతనంతో విధులు

శిక్షణ పూర్తి చేసుకున్న ఎస్‌ఐలు జవాబుదారీతనంతో విధులు నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవాలని రాష్ట్ర డీజీపీ హరీష్‌కుమార్‌ గుప్తా సూచించారు. అనంతరం శిక్షణ సమయంలో ఫైరింగ్‌, ఇండోర్‌, అవుట్‌డోర్‌ విభాగాల్లో రాణించిన, ప్రతిభ కనబరిచిన వారికి హోం మంత్రి చేతుల మీదుగా పతకాలు, ట్రోఫీలు అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ట్రైనింగ్స్‌ విభాగం ఐజీపీ కేవీ మోహన్‌రావు, ఏపీఎస్పీ బెటాలియన్స్‌ విభాగం ఐజీ రాజకుమారి, కర్నూలు రేంజ్‌ డీఐజీ కోయ ప్రవీణ్‌, అనంతపురం ఎస్పీ పి.జగదీష్‌, శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ వి.రత్న, జెడ్పీ చైర్‌పర్సన్‌ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్యేలు దగ్గుపాటి ప్రసాద్‌, ఎమ్మెస్‌ రాజు, పల్లె సింధూరరెడ్డి, పీటీసీ కోర్సు డైరెక్టర్‌ మల్లికార్జున వర్మ, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణలో రైతుబిడ్డ టాపర్‌

బెళుగుప్ప మండలం రమనేపల్లికి చెందిన రైతు దంపతులు ఆంజనేయులు, సాలమ్మల కుమారుడైన మంజునాథ్‌ ఎస్‌ఐ పరీక్ష ఫలితాల్లో అర్హత సాధించి అనంతపురం పోలీసు శిక్షణ కళాశాల(పీటీసీ)లో శిక్షణ పొందాడు. శిక్షణలో అవుట్‌డోర్‌ టాపర్‌గాను, ఓవరాల్‌ టాపర్‌గాను, గోల్డ్‌ మెడల్‌తో పాటు సీఎం పిస్టల్‌ విజేతగా నిలిచారు. హోంమంత్రి అనిత చేతుల మీదుగా పిస్టల్‌ అందుకున్నారు. రైతు బిడ్డ ఎస్‌ఐ శిక్షణలో టాపర్‌గా నిలిచి బెళుగుప్ప మండలానికే పేరుతెచ్చారని సర్పంచ్‌ రమేష్‌ తదితరులు అభినందనలు తెలిపారు.

సివిల్స్‌ లక్ష్యం



మాది విశాఖపట్నం. ఎంటెక్‌ పూర్తి చేశాను. బీటెక్‌ చదివేటప్పుడే సివిల్స్‌ రాయాలనే లక్ష్యం పెట్టుకున్నా. 2019లో ఎస్‌ఐ రిక్రూట్‌మెంట్‌కు నోటిఫికేషన్‌ వచ్చింది. 2023లో పరీక్ష రాసి ఎంపికయ్యాను. ట్రైనింగ్‌ చాలా కష్టంతో కూడి ఉంటుంది. ఇండోర్‌, అవుట్‌డోర్‌ శిక్షణలో రాటు దేలాను. సివిల్స్‌కు సన్నద్ధం అవుతాను. నా లక్ష్యాన్ని తప్పక చేరతాను అనే నమ్మకం ఉంది. – షహీబా అంజుమ్‌

నాన్న ఆశయం నెరవేర్చా



మాది కర్నూలు జిల్లా. బీఎస్సీ పూర్తి చేశాను. అమ్మ,నాన్న లక్ష్మీదేవి, వెంకటేశ్వర్లు. నాన్న ఎక్సైజ్‌ హెడ్‌కానిస్టేబుల్‌. నాన్న ఆశయంతోనే పోలీసు అధికారి అయ్యాను. సివిల్‌ సర్వీసెస్‌పై దృష్టి సారిస్తాను. ఐపీఎస్‌ సాధిస్తాననే నమ్మకం ఉంది. ఆడవాళ్లం అనే కారణంతో భయపడి వెనకడుగు వేయకూడదు. అనుకున్నది సాధించడానికి ప్రయత్నం ఆపకూడదు. – కె.చైతన్య స్వరూపిణి

ఫార్మసీ నుంచి పోలీస్‌ వృత్తిలోకి..



మాది అనంతపురంలోని సాయినగర్‌. బీ ఫార్మసీ పూర్తి చేశాను. అమ్మా,నాన్న పుష్పావతి, శివరాం. గ్రూప్‌-1కి సన్నద్ధం అవుతూ ఎస్‌ఐ రిక్రూట్‌మెంట్‌కు దరఖాస్తు చేశాను. ఎస్‌ఐగా ఎంపికైన అనంతరం గ్రూప్‌-1 రాసి డీఎస్పీగా ఎంపిక కావాలనే ఆకాంక్ష అధికమైంది. అమ్మా,నాన్న స్ఫూర్తితోనే ఉద్యోగం సాధించాను. – కేబీ చందనా ప్రియ

క్లుప్తంగా

నిత్యావసరాలను సక్రమంగా పంపిణీ చేయాలి



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న డీఎస్‌ఓ వంశీకృష్ణారెడ్డి

తాడిమర్రి: ప్రభుత్వ చౌక ధాన్యపు దుకాణాల ద్వారా ప్రజలకు నిత్యావసరాలను సక్రమంగా పంపిణీ చేయాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి పీజీ వంశీకృష్ణారెడ్డి డీలర్లను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండలంలోని డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యావసరాల పంపిణీలో అవకతవకలకు పాల్పడొద్దన్నారు. ఎవరైనా తూకాలు తక్కువగా ఇచ్చినా, సరుకులను బ్లాక్ మార్కెట్ తరలించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అందుబాటులో ఉన్న సరుకులు అన్నింటికీ డీడీలు తీసి పంపాలని సూచించారు. అంతకు ముందు ఆయన స్థానిక బీసీ కాలనీలో ఉన్న 1వ చౌక దుకాణాన్ని తనిఖీ చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ భాస్కర్‌రెడ్డి, సీఎస్‌టీడీ శారద తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు



మాట్లాడుతున్న డీఏఓ సుబ్బారావు

కదిరి అర్బన్: నిబంధనల ప్రకారం ఎరువులు, పురుగు మందులు విక్రయించాలని లేనిపక్షంలో చర్యలు తప్పవని జిల్లా వ్యవసాయాధికారి(డీఏఓ) సుబ్బారావు ఎరువులు, పురుగు మందుల డీలర్లను హెచ్చరించారు. శనివారం స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో అగ్రి ఇన్‌పుట్ డీలర్స్ మీట్– 2025 జరిగింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి డీలర్ ఎమ్మార్పీకే విక్రయాలు జరపాలన్నారు. ఈ పాస్‌తో విక్రయాలు చేస్తూ రైతులకు బిల్లులు ఇవ్వాలన్నారు. ఎరువులు పురుగుల మందుల చట్టంపై అవగాహన కల్పించారు. వ్యవసాయాధికారులు క్రమం తప్పకుండా ఎరువులు, పురుగుల మందుల దుకాణాలపై తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఏడీఏ సత్యనారాయణ మాట్లాడుతూ లైసెన్స్ కలిగిన డీలర్స్ మాత్రమే విక్రయాలు చేయాలన్నారు. దుకాణాల వద్ద ధరల పట్టిక ఉంచాలన్నారు. బ్లాక్‌లో అమ్మకాలు సాగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వ్యవసాయ పరిశోధనాస్థానం ప్రధాన శాస్త్రవేత్త డా. కిరణ్‌కుమార్‌రెడ్డి విత్తన నాణ్యత, పరిశుభ్రత, మొలకశాతంపై అవగాహన కల్పించారు. డీఆర్‌సీ ఏడీ సనావుల్లా, కదిరి డివిజన్ పరిధిలోని డీలర్లు, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

ముక్క లేనిదే ముద్ద దిగదాయె..



- అనంతపురంలోని పాతూరుకు చెందిన షణ్ముగ వయసు 15 ఏళ్లు. చికెన్ అంటే మహా ఇష్టం. ఒక్క రోజులోనే కేజీ చికెన్ ఫ్రైచేసి ఇచ్చినా తినేస్తానంటాడు. నెలలో 10 రోజులు చికెన్ ఉండాల్సిందే అంటున్నాడు.
- గుంతకల్లుకు చెందిన రోషన్ ఆలీకి ఇరవై ఏళ్లు. తండ్రి మటన్ వ్యాపారం చేస్తాడు. అయినా సరే రోషన్‌కు చికెన్ అంటే ప్రాణం. రోజూ రెండు ముక్కలైనా చికెన్ ఉండాల్సిందే అంటున్నాడు.

ఇదీ యుక్త వయసు పిల్లల ఆహారశైలి

- 75.3 శాతం మంది చికెన్‌పై అమితాసక్తి
- కూరగాయలు, పండ్లు, పీచు పదార్థాలపై నిరాసక్తత
- చేపల వినియోగంలో ఉమ్మడి జిల్లా టీనేజర్ల వెనుకంజ

సాక్షి ప్రతినిధి, అనంతపురం: యుక్తవయసు పిల్లలు శాకాహారం కన్నా మాంసాహారానికే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. మెజారిటీ పిల్లలు చికెన్ అంటే మరీ లొట్టలేసుకుని తింటున్నారు. రాష్ట్రంలో మిగతా జిల్లాలతో పోలిస్తే చికెన్, మటన్ తింటున్న వారిలో ఉమ్మడి అనంతపురం జిల్లా మూడవ స్థానంలో ఉన్నట్టు తేలింది. నేషనల్ న్యూట్రిషనల్ సర్వే ఈ విషయాలను వెల్లడించింది. 10 నుంచి 19 ఏళ్ల మధ్య వయసు గల పిల్లల్లో 75.3 శాతం మంది చికెన్ తింటున్నారు. తర్వాతి స్థానం 51.6 శాతంతో మటన్ ఆక్రమించింది. దేశంలో మాంసాహార వినియోగం ఏపీలో ఎక్కువగా ఉండగా, అందులో ఉమ్మడి అనంతపురం జిల్లాలో తక్కువేమీ కాదన్నట్టుంది.

10 నుంచి 19 ఏళ్ల వయసు కుర్రాళ్లలో వివిధ మాంసాహార శాఖాహార వినియోగం ఇలా

కేటగిరీ	వినియోగం
చికెన్	75.3 శాతం
మటన్	51.6
చేపలు	38.7
పోర్క్	1.7
కూరగాయలు	21.6
పండ్లు	38.8

కూరగాయలు, పండ్లు తినడంలో వెనుకంజ

ఉమ్మడి జిల్లాలో చిన్నారులు, కుర్రాళ్లు చికెన్, మటన్‌ను ఇష్టపడినట్టుగా కూరగాయలు, పండ్లపై మక్కువ చూపడం లేదు. ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్ర అని జిల్లాకు పేరున్నా ఇక్కడ పండ్ల వినియోగం చాలా తక్కువగా ఉంది. 2–4 ఏళ్ల మధ్య వయసు చిన్నారుల్లో విటమిన్–ఏతో కూడిన తిండి, కూరగాయలు తినడంలో మిగతా జిల్లాలతో పోలిస్తే చాలా వెనుకబడి ఉన్నట్టు తేలింది. పండ్లు, కూరగాయలు తినడంలో కృష్ణా, విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాలు ముందంజలో ఉన్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాలో చేపల లభ్యత బాగానే ఉన్నప్పటికీ చికెన్, మటన్‌తో పోలిస్తే తక్కువ వినియోగం ఉన్నట్టు తేలింది.

మాంసాహారంపైనే మక్కువ

- ఉమ్మడి జిల్లాలో ఎక్కువ మంది కుర్రాళ్లు మాంసాహారం తినడానికి రకరకాల కారణాలున్నాయి. వాటిని ఒక్కసారి చూస్తే...
- కుటుంబ నేపథ్యంలో చిన్నప్పటినుంచే మాంసాహారంపై మక్కువ పెంచుకోవడం.
- చికెన్ ఉత్పత్తులు ఎక్కువగా అందుబాటులో ఉండటం.
- సామాన్య, మధ్యతరగతి కుటుంబాల్లో కొనుగోలు స్థాయి పెరగడం.
- మాంసాహారాన్ని సాధారణ మెనూగా భావించి వినియోగించడం.
- యువతను ఎక్కువగా ఆకర్షించేలా విభిన్న రుచుల్లో మాంసాహార వంటకాలు ఉండటం.
- మాంసాహార వినియోగం పెరుగుతున్న స్థాయిలో వ్యాయామం చేయడం లేదు.
- వయసుకు మించి బరువు ఎక్కువగా ఉన్న వారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది.

ఫైబర్ ఆహారం తినడం లేదు



- శరీరానికి అత్యవసరమయ్యే ఫైబర్ (పీచు)తో కూడిన ఆహారం కుర్రాళ్లకు రుచించడం లేదు.
- చిక్కుడు, గోరు చిక్కుడు, బీన్స్ వంటి కూరగాయలను పట్టించుకోవడం లేదు.
- మొలకలతో కూడిన గింజలు, చిరుధాన్యాలను దరిచేరనివ్వడం లేదు.
- గోబీ మంచూరియా, పానీపూరీ, కట్‌లెట్ లాంటి అనారోగ్యకర ఆహారంపై మక్కువ.
- పాలు, పాలపదార్థాలతో కూడిన ఆహారం కూడా తక్కువగా వినియోగిస్తున్నారు.
- ఫ్రైడ్ ఆహారం తినడం వల్ల 30 ఏళ్లకే గ్యాస్ట్రిక్, అల్సర్ సమస్యలతో సతమతం.

మహిళ సాధికారతతోనే సమాజాభివృద్ధి



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ చేతన్ తదితరులు

ప్రశాంతి నిలయం: మహిళా సాధికారతతోనే సమాజాభివృద్ధి సాధ్యమని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాల సందర్భంగా శనివారం జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి కలెక్టర్ జెండా ఊపి ప్రారంభించగా, గణేష్ సర్కిల్ వరకూ కొనసాగింది. అక్కడ మానవ హారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సమాజంలో మహిళల ప్రాధాన్యత, మహిళలకు ఇవ్వాల్సిన గౌరవం, బాల్య వివాహాల అనర్థాలను వివరిస్తూ నినాదాలు చేశారు. అంతకుముందు కలెక్టర్ మాట్లాడుతూ మహిళలపై హింసను నిరోధించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ఐసీడీఎస్ పీడీ సుధా వరలక్ష్మి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ వారోత్సవాలు జిల్లా వ్యాప్తంగా మార్చి 8వ తేదీ వరకూ నిర్వహిస్తున్నామన్నారు. డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఫిరోజ్ బేగం, సీడీపీఓ గాయత్రి, జిల్లా కో ఆర్డినేటర్ సురేష్ కుమార్, నాగలక్ష్మి, పీఓ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి



మృతుడు శివప్ప

గోరంట్ల: బూచేపల్లిలో ఓ రైతు విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సీఐ బోయ శేఖర్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన రైతు శివప్ప (33) ఇటీవల తన పొలంలో బోరు వేశాడు. దీంతో కట్టెలపై తాత్కాలికంగా విద్యుత్ కేబుల్‌ను లాగాడు. శనివారం విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో కట్టెపై ఉన్న కేబుల్‌ను పరిశీలించేందుకు యతి్నంచాడు. కేబుల్ దెబ్బతిన్న చోట తాకడంతో ఒక్కసారిగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ పేర్కొన్నారు.

వైభవంగా వసంతోత్సవం



శివపార్వతులకు వసంతోత్సవం చేస్తున్న వేదపండితులు



ప్రత్యేక అలంకరణలో వీరభద్రస్వామి, దుర్గాదేవి

లేపాక్షి: శివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం లేపాక్షి వీరభద్రస్వామి ఆలయంలో శివపార్వతులకు వసంతోత్సవం నిర్వహించారు. నాట్యమంటపంలో శివపార్వతుల ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేశారు. వేదపండితులు హోమాలను నిర్వహించి గ్రామానికి, ప్రజలకు మంచి జరగాలని ఆ దేవదేవుడిని వేడుకున్నారు. అదేవిధంగా ఆలయంలో ధ్వజాఅవరోహణ కార్యక్రమం, సాయంత్రం శయనోత్సవం తదితర కార్యక్రమాలు నిర్వహించి మహాశివరాత్రి ఉత్సవాలకు ముగింపు పలికారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్, ఈఓ నరసింహమూర్తి, గ్రామ పెద్దలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

నయన మనోహరం.. ప్రేమ వాహిని నృత్యరూపకం



ప్రేమ వాహిని నృత్యరూపకంలోని ఘట్టం

ప్రశాంతి నిలయం: బాలవికాస్ చిన్నారులు నిర్వహించిన 'ప్రేమ వాహిని' సంగీత నృత్యరూపకం నయన మనోహరంగా సాగింది. పర్తియాత్రలో భాగంగా 2 వేల మంది సత్యసాయి భక్తులు ఆదిలాబాద్, మంచిర్యాల్, నిర్మల్, కొమురం భీం ఆసీఫాబాద్ జిల్లాల నుంచి పుట్టపర్తికి విచ్చేశారు. శనివారం సాయంత్రం సాయికుల్వంత్ సభా మందిరంలో సత్యసాయి మహా సమాధి చెంత ఆధ్యాత్మిక సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టారు. పిదప సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

పవిత్ర మాసం.. ఆధ్యాత్మిక వికాసం

- ప్రారంభమైన రంజాన్ సందడి
- నేటి నుంచి ఉపవాస దీక్షలు





హిందూపురంలోని ముక్కిడి పేటలో వెలసిన మసీద్ ఏ -గౌసియా, (ఇన్‌సెట్) హిందూపురంలో కనిపించిన నెలవంక

ఎస్‌పీకుంట/ హిందూపురం అర్బన్/ బత్తలపల్లి: ముస్లింలకు పరమ పవిత్రమైన మాసం రంజాన్. సత్కార్యాలు, మానవతా విలువలు పరిమళించే వరాల వసంతం. మానసిక ఆధ్యాత్మిక వికాసానికి, జీవన సాఫల్యానికి అవసరమైన సమస్త విషయాలు ఈ మాసంతో ముడిపడి ఉన్నాయి. ముస్లింల పవిత్ర గ్రంథం ఖురాన్ ఇదే నెలలో అవతరించింది. అందుకే ఈ మాసంలో ముస్లింలు భక్తిశ్రద్ధలతో గడుపుతారు. శ్రీ సత్యసాయి జిల్లా వ్యాప్తంగా 300 పైగా మసీదులు ఉన్నాయి. రంజాన్‌తో మసీదులన్నీ ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి.

30 రోజులు.. మూడు భాగాలు...

రంజాన్ మాసం 30 రోజులపాటు ఉండగా దీనిని మూడు భాగాలుగా విభజిస్తారు. ఇందులో మొదటి 10 రోజుల పాటు ఉపవాసం ఉండటాన్ని రహ్మత్ (దయను పొందటం) మొదటి భాగంగా పరిగణిస్తారు. రెండవ భాగం 10 రోజులను మగ్ఫిరత్ (క్షమను కోరడం)గా విశ్వశిస్తారు. చివరి 10 రోజులను జహ్హన్నుం సే నజాత్ (నరకం నుంచి విముక్తి)గా చూస్తారు. మూడో భాగంలో వచ్చే 21, 23, 25, 27, 29వ రాత్రులను పరమ పవిత్రమైనవిగా భావించి ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు.

ఉపవాస దీక్షలు..

పవిత్ర రంజాన్ మాసంలో రోజూ తెల్లవారు జాము నుంచి సాయంత్రం వరకు ముస్లింలు కఠిన ఉపవాస దీక్షలను పాటిస్తారు. పొద్దంతా ఉపవాసంతో ఆరోగ్యం దెబ్బతినకుండా పౌష్టికాహారం తీసుకుంటారు. ఉపవాస దీక్షతో ఎదుటివారి ఆకలి బాధ తెలియడంతోపాటు సహన గుణం పెరుగుతుంది. కష్టాలను ఎదుర్కొనే శక్తి లభిస్తుంది.

దాన, ధర్మాలు..

ప్రతి ముస్లిం తన స్తోమతకు తగినట్లు ఈ మాసంలో దాన, ధర్మాలు చేయడాన్ని విధిగా భావిస్తారు. ఒక ముస్లిం వద్ద ఏడాది పాటు ఉన్న నగదు, బంగారంతో పాటు ఇతర సంపదను లెక్క వేస్తారు. ఇందులో నుంచి కొంత భాగం జకాత్ పేరిట దానాలు చేస్తారు. ప్రతి మనిషి (గర్భంలో ఉన్న శిశువుకు సైతం) ఫిత్రా చెల్లిస్తారు. నిరుపేదలకు ఈ మొత్తం అందేలా చూస్తారు.

ప్రత్యేక ప్రార్థనలు..

ఈ మాసంలో ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. రోజూ చేసే ప్రార్థనల కన్నా తరావీహ నమాజ్‌కు ప్రత్యేక స్థానం ఉంటుంది. దురలవాట్లకు దూరంగా సత్యనిష్ఠగా ఉంటారు. దివ్య ఖురాన్ ప్రబోధాలను తెలుసుకొని ఆచరించడానికి ప్రయత్నిస్తారు. వయోబేధం లేకుండా ప్రార్థనలు ఆచరిస్తారు.

ఆకలి బాధలు తెలుస్తాయి



రంజాన్ మాసంలో ఉపవాసంతో ఆకలి బాధలు తెలుస్తాయి. తద్వారా పేదల ఆకలి బాధలు తీర్చాలన్న గుణం అలవడుతుంది. నిత్యం అల్లాహ్ స్మరణలో ఉండటంతో మనిషి సన్మార్గం వైపు పయనించగలడని విశ్వాసం.

– హజ్రత్ బాబ్జాన్, మండల ఖాజీ, ఎస్.పీ.కుంట

ఇబాదత్‌తో పుణ్యఫలం



రంజాన్ మాసం మొత్తం ఇబాదత్‌తో(దైవ ప్రార్థనతో) గడపాలి. దాన ధర్మాలు చేయాలి. ఉపవాస దీక్షలు తప్పకుండా పాటించాలి. రంజాన్ చివరి పది రోజుల్లో ఐదు తాక్‌రాత్‌లు వస్తాయి. అన్ని రాత్రులు ఇబాదత్ బాగా చేయాలి. లైలాతుల్ ఖదర్ రాత్రి దైవ దర్శనాలతో గడిపితే పుణ్యఫలం సిద్ధిస్తుంది.

– పి.నూరుల్లా ఖాన్, జామియా మసీదు ముతవల్లీ, హిందూపురం.

కబళించిన మృత్యువు

- పెళ్లయిన నెలరోజులకే రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి
- మృతుడు తపాలా ఉద్యోగి

పెళ్లయిన నెల రోజులకే రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించింది. కొద్దిసేపటి క్రితం ఆనందంగా గడిపిన భర్త విగతజీవిగా పడి ఉండటాన్ని చూసిన భార్య కన్నీరుమున్నీరైంది. అల్లా నాకు ఇంకెవరు దిక్కు అంటూ ఆమె రోదించిన తీరు చూపరులను కంటతడిపెట్టించింది. ఇదే ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన మృతుడి తమ్ముడి పరిస్థితి విషమంగా ఉంది.



మృతుడు దాదాపీర్(ఫైల్)



ఆస్పత్రిలో రోదిస్తున్న మృతుడి భార్య, బంధువులు

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని కుటాగుళ్ల గ్రామంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తపాలా ఉద్యోగి మృతి చెందారు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు తెలిపిన వివరాలు.. పట్టణానికి చెందిన దాదాపీర్(25) తపాలా ఉద్యోగిగా అగళిలో పని చేస్తున్నాడు. శనివారం ఇంటర్ పరీక్షలు రాసిన తన తమ్ముడు సయ్యద్‌బాషాను బ్లూమూన్ కళాశాల నుంచి తన బైక్‌పై ఎక్కించుకుని ఇంటికి బయలుదేరాడు. కుటాగుళ్ల సర్కిల్ వద్ద పులివెందుల రోడ్డుపై ఆర్టీసీ బస్సును ఢీకొన్నాడు. ఘటనలో తలకు తీవ్రగాయాలు కావడంతో దాదాపీర్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన సయ్యద్‌బాషాను అక్కడి నుంచి కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తీసుకెళ్లారు. సయ్యద్‌బాషా కోమాలో ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మిన్నంటిన రోదనలు..

దాదాపీర్ నెల రోజుల క్రితం కుటాగుళ్లకు చెందిన అల్ఫియాను వివాహం చేసుకున్నాడు. దాదాపీర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న భార్య, తల్లిదండ్రులు, అత్తమామలు, బంధువులు పెద్దసంఖ్యలో ప్రభుత్వాస్పత్రికి చేరుకున్నారు. ఈసందర్భంగా మృతుడి భార్య, కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. దేవుడా మాకు ఇంత అన్యాయం చేశావా అంటూ కన్నీరుమున్నీరయ్యారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ బాబ్జాన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు

నల్లమాడ: అరవవాండ్లపల్లి తండా సమీపాన నల్లమాడ–పుట్టపర్తి రహదారిలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. వివరాలు.. మండలంలోని తిప్పయ్యగారిపల్లికి చెందిన రామప్ప, రమేష్‌బాబు, కిరణ్‌కుమార్ బైక్‌పై నల్లమాడ మీదుగా పుట్టపర్తి బయలుదేరారు. అరవవాండ్లపల్లి సమీపానికి వెళ్లగానే బైక్‌పై అదుపుతప్పి కింద పడటంతో ముగ్గురికీ ముఖం, చేతులు, కాళ్లు, ఛాతీపై బలమైన రక్తగాయాలయ్యాయి. స్థానికులు 108లో క్షతగాత్రులను నల్లమాడలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం 108లో కదిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

మామిడితోటలో వ్యక్తి దారుణ హత్య



నగేష్ మృతదేహం

పుట్టపర్తి అర్బన్: మద్యం మత్తులో ఉన్న ఓ వ్యక్తిని గొంతు కోసి హతమార్చిన ఘటన వెంగళమ్మచెరువు సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు అందించిన వివరాలు.. బుక్కపట్నం మండలం కొత్తకోటకు చెందిన చియ్యేడు గంగన్న కుటుంబం సుమారు 15 ఏళ్ల క్రితం వెంగళమ్మచెరువులో స్థిరపడింది. గంగన్న కుమారుడు చియ్యేడు నగేష్(35) సొంతంగా ట్రాక్టర్ పెట్టుకొని బాడుగలకు తిప్పడంతో పాటు బేల్దారి పనులకు వెళ్లేవాడు. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి వెళ్లిన అతడు తిరిగిరాలేదు. స్థానిక షిర్డీసాయి బాబా ఆలయం సమీపంలోని వెంకటేషు మామిడితోటలో శనివారం సాయంత్రం నగేష్ మృతదేహాన్ని గుర్తించిన గ్రామానికి చెందిన పశువుల కాపరులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేశారు. దీంతో వారు అక్కడికి చేరుకుని బోరునవిలపించారు. విషయం తెలుసుకున్న పుట్టపర్తి రూరల్ ఎస్‌ఐ లింగన్న సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. డాగ్ స్క్వాడ్ రప్పించి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా గ్రామంలోని సీసీటీవీ ఫుటేజీల్లో అదే గ్రామానికి చెందిన దివాకర్ అనే వ్యక్తి నగేష్‌ను బైకుపై ఎక్కించుకెళ్లినట్లు నమోదవడంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మృతదేహం పక్కన మద్యం బాటిళ్లు పడి ఉండటంతో మద్యం మత్తులో గొడవ జరిగి హత్యకు గురయ్యాడా లేదా అక్రమ సంబంధం నేపథ్యంలో ఘటన జరిగిందా అనే కోణంలో పోలీసులు విచారణ చేస్తున్నారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.